క్లుప్తంగా

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



మురారి జగనన్న కాలనీలో వసతుల కల్పనపై చర్చిస్తున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మండలంలోని మురారి జగనన్న కాలనీని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, డ్రైన్లు, రోడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాసరావు, సుబ్బలక్ష్మి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ రమేష్ తదితరులు ఉన్నారు.

రైతులు శక్తివంతమైతేనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరరాఘవులు

ప్రత్తిపాడు: రైతులు శక్తివంతమైనప్పుడే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వీరరాఘవులు అన్నారు. ప్రత్తిపాడు వేగులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం బీకేఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరరాఘవులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన వారందరినీ బీకేఎస్‌లో సభ్యులుగా చేర్చాలని సూచించారు. బియ్యం ఎగుమతిపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రాసంశెట్టి రాజా, కోశాధికారి గట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

శంఖవరం: జగనన్న భూహక్కు– భూరక్ష పథకంలో చేస్తున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని డీఎస్ఎల్ఓ బి.లక్ష్మీనారాయణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నెల్లిపూడిలో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. రీ సర్వేలో సమస్యలు తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భూముల రీ సర్వేతో గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతులు తప్పనిసరిగా తమ భూములకు సర్వే చేయించుకోవాలని సూచించారు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్వేయర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధాకర్

ప్రత్తిపాడు రూరల్: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ సూచించారు. మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుధాకర్ మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా రాచపల్లి పీహెచ్‌సీ ఏటా జిల్లాలో టాప్ టెన్‌లో నిలుస్తోందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

టీడీపీ మహిళా శక్తి ప్రచార రథయాత్ర ప్రారంభం

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరంలో టీడీపీ మహిళా శక్తి ప్రచార రథయాత్రను శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వివరించారు. కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మండల పార్టీ అధ్యక్షుడు చందరం చంటిబాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

పిఠాపురం: గ్రామాల్లోని సారా బట్టీలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ అజయ్ కుమార్ సింగ్, ఎక్సైజ్ సీఐలు సునీల్ కుమార్, నాగవల్లీ తమ సిబ్బందితో పిఠాపురం మండలం కొత్త కొంపలలో దాడులు నిర్వహించారు. 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

సురక్షతో లబ్ధిదారులకు మేలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వేలంకలో 842 మందికి ధ్రువపత్రాల పంపిణీ



వెంగయమ్మపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



పెద్దనాపల్లిలో లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

కిర్లంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వేలంకలో వైఎస్సార్ సీపీ నాయకుడు దోమాల గంగాధర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని 842 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే వలంటీర్లు, అధికారులు వచ్చి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తునఅనరన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు స్వామి, గుత్తిర్తి రమణ, అడబాల శ్రీను, చిట్నీడి శివ, బచ్చల గణిలక్ష్మి, శెట్టి సోమరాజు, చదలవాడ బాబీ, తోట విష్ణు, జనపరెడ్డి బాబు, పెనగంటి రాజేష్, తహసీల్దార్ కేవీ మాధవరావు, ఈటీపీ ఆర్డీ రామిశెట్టి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

జగ్గంపేట: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వెంగయమ్మపురంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రయోజనం

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత సచివాలయం–2 నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ బుద్దా సూర్య ప్రకాశ్, నీరుకొండ సత్యనారాయణ, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, బుద్దా ఈశ్వరరావు, అలమండ చలమయ్య, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



టి.తిమ్మాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

అందరికీ సంక్షేమ పథకాలు

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవానీ అన్నారు. మండలంలోని టి.తిమ్మాపురంలో శుక్రవారం సర్పంచ్ అత్తి వరలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు వివిధ రకాల ధృవపత్రాలు అందజేశారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి నాగేశ్వరరావు, ఏఓ శేషగిరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ఏఈ సూర్యనారాయణ

ఏలేశ్వరం: స్థానిక షిర్డీనగర్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యల నేపథ్యంలో గతంలో 'సాక్షి'లో టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేదెప్పుడో ? అనే శీర్షికతో కథనం వచ్చింది. దీనికి స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఏఈ సూర్యనారాయణ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

సాక్షి ఇంపాక్ట్

నాడు-నేడు పనుల పరిశీలన

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం.శ్రీనువాస్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కత్తిపూడి ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ రాఘవేంద్ర, జేఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- పెద్దనాపల్లిలో గడపగడపకూ..



పెద్దనాపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: పేదల అభ్యున్నతి, సంక్షేమ పథకాల కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలపరిధిలోని పెద్దనాపల్లిలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్ల లో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుద్దా సూర్యప్రకాష్, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, బుద్దా ఈశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణునిపాలెంలో పొలంబడి

గోకవరం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ రాజేశ్వరి సూచించారు. కృష్ణునిపాలెంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సాగు పద్ధతులు, ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో 34 వేల మందికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీటి ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో గాదెలపాలెం సర్పంచ్ కమ్మెల అచ్చిబాబు మాట్లాడుతూ గతంలో తమ గ్రామం మీదుగా రాజమహేంద్రవరానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేదని, ప్రస్తుతం ఈ సర్వీసు స్థానంలో కాకినాడకు వెళ్లే సర్వీసు ఏర్పాటు చేయడంతో రాజమహేంద్రవరం వెళ్లి చదువుకునే విద్యార్థులు రెండు బస్సులు మారాల్సి వస్తోందన్నారు. గతంలో ఉన్న సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని కోరారు. జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో ట్రాన్స్ కో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కామరాజుపేటలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని తదితర సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. గోకవరం నుంచి తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి మీదుగా కోరుకొండ మండలం రాఘవపురం వేళ్లేందుకు రూ.10.50 కోట్లతో రోడ్డు మంజూరైందని ఆర్‌అండ్‌బీ జేఈ వీరన్న తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, తహసీల్దార్ సుగుణ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలపై గరంగరం

- అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు
- అభివృద్ధి పనులపై సమాచారం లేదని ఆవేదన
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తుని: ప్రతిపక్షం లేని కౌన్సిల్‌లో పట్టణ సమస్యలపై స్వపక్షానికి చెందిన కౌన్సిలర్లు విరుచుకుపడ్డారు. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులుగా ఉన్నా అధికారులు మాత్రం అభివృద్ధి పనులకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తుని పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 27 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమస్యలపై గళమెత్తి...

పట్టణంలోని సమస్యలపై జీరో అవర్ వాడీవేడిగా చర్చ జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ మాట్లాడుతూ మార్కెట్ యార్డు వద్ద వ్యర్థాలు వలన దుర్వాసన వస్తోందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వస్తున్న వ్యర్థాలు మార్కెట్ యార్డు వద్ద రోడ్డులో వేయడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాడు–నేడు పనుల విషయంలో కౌన్సిలర్లకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, దీంతో ప్రజలకు వార్డులో జరిగే అభివృద్ధిని వివరించే అవకాశం లేకుండా పోతుందని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికులు అనారోగ్యంతో మృతి చెందినా వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించలేదని కౌన్సిలర్ పులి సత్తిబాబు అన్నారు. నాలుగు రోజుల్లో దీనిపై స్పష్టత ఇవ్వక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమాచారం ఇవ్వకుంటే చర్యలు

పట్టణంలో తాగునీరు, విద్యుత్, కాలవలు, రోడ్లు తదితర సమస్యలపై పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని చైర్‌పర్సన్ సుధారాణి అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధి విషయంలో అధికారులు విధిగా సమాచారం ఇవ్వాలని, లేకపోతే సంబంధితశాఖ అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన అన్ని వివరాలను కౌన్సిలర్ల దృష్టికి తీసుకువెళ్తామని కమిషనర్ ప్రసాదరాజు సమాధానం ఇచ్చారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించిన దేవదాయ శాఖ కమిషనర్



లోవ దేవస్థానంలో అభివృద్ధి పనుల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం లోవ దేవస్థానానికి వచ్చిన కమిషనర్‌కు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలో ఇటీవల పునఃప్రతిష్ఠించిన అమ్మవారిని కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు వేదపండితులు ఆశీస్సులు అందజేయగా అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను ఈఓ బహూకరించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

లోవ దేవస్థానంలో రూ.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ సత్యనారాయణ పరిశీలించారు. దేవస్థానం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. కృష్ణశిలతో ప్రధానాలయం పునఃనిర్మాణం, ఐదు అంతస్తుల మహా మండపం, మహా గోపురం, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల ప్రగతిని లోవ దేవస్థానం ఈఓ విశ్వనాథరాజు వివరించారు. ఈఈ తోట దుర్గేష్ కుమార్, డీడీ ఉదయ్‌కుమార్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచార్యులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే-ఫ్రై డే



పాతకొట్టాంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

కోటనందూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం డ్రై డే–ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ, పారామెడికల్ సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. డ్రైన్లు, రోడ్లను శుభ్రం చేయించారు. ఇళ్ల మధ్య ఉండే రుబ్బు రోళ్లు, తాగేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, నీటి తొట్టెలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కోటనందూరు, కేఏ మల్లవరం, కేఓ అగ్రహారం, పాతకొట్టాం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాన్ని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

చారుమజుందార్‌కు ఘన నివాళులు



ఏలేశ్వరంలో చారుమజుందార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో చారుమజుందార్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద చారు మంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన చారుమజుందార్‌ను పోలీసులు అన్యాయంగా అంతమొందించారన్నారు. పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, నాగులాపల్లి అర్జునుడు, మాడెం బాబీ, కోన గంగాధర్, గుమ్మడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో నక్సల్బరీ ఉద్యమ నేత చారు మజుందార్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. తొలుత సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చారు మజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లిబరేషన్ అనుబంధ సంఘాల నాయకులు రాజాల రత్నం, మాసా రాజామణి, బీర దేవతయ్య, బోడపాటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 21, 22 తేదీల్లో ఎన్జీవో కౌన్సిల్ సమావేశాలు

తుని రూరల్: విజయవాడలో ఆగస్టు 21, 22 తేదీల్లో జరిగే ఏపీఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని తుని తాలూకా అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఏపీఎన్జీవో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. తుని యూనిట్ నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగే 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సంఘ సహా అధ్యక్షులు డి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

జగ్గంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగ్గంపేట డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ధర్నా శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు నినాదాలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోకవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఐదు వేల మునగ మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఎమ్మెల్యే కోరారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, ఎంపీడీఓ పద్మజ్యోతి, తహసీల్దార్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి తోట నరసింహం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని తామరాడలో శుక్రవారం తోట అయ్యన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తోట రాంజీ, తోట బాబ్జీ, ఓలేటి రాజేశ్వరరావు, అత్తులూరి సాయిబాబు, ఎస్.కపూర్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న సిబ్బంది

అన్నవరం: శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఓ మహిళ 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. నెల్లిపూడికి చెందిన గర్భిణి మాసా సునీతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అన్నవరంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వెంటనే నెల్లిపూడి వెళ్లి సునీత రౌతులపూడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మగ శిశువు జన్మించినట్టు అంబులెన్స్ ఈఎంటీ టి.విద్యాసాగర్, పైలెట్ కరుణ సాగర్ తెలిపారు.